క్లుప్తంగా

కళాశాలలో ఆర్వో వాటర్ ప్లాంటు ప్రారంభం



గుంటూరు ఎడ్యుకేషన్: లాడ్జి సెంటర్లోని ఏఎల్ బీఈడీ కళాశాలలో మిషన్ రుయా వాటర్ ప్లాంటు సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంటును శుక్రవారం ఏఈఎల్‌సీ మోడరేటర్ బిషప్ డాక్టర్ కె.ఎఫ్. పరదేశీ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ఆర్వో వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ఎస్తేరు సునీల, మిషన్ రుయా వాటర్ ప్లాంట్ ప్రతినిధి ఫాదర్ ఉన్నం కిరణ్‌కుమార్, ఏసీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కనపాల జోసఫ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి

నెహ్రూనగర్: జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీడీ మనోరంజని తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం సిబ్బంది సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా ఫీల్డ్ లెవల్‌లో సిబ్బంది సమస్యల్ని పీడీ అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ యాప్ టెక్నికల్ సమస్యల్ని పలువురు ఆమె దృష్టికి తీసుకురాగా వెంటనే వాటికి పరిష్కారం చూపారు. సమష్టిగా పనిచేసి పోషకాహారలోపరహిత, రక్తహీనత గుంటూరు జిల్లాగా ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె చెప్పారు. అనంతరం ఇటీవల ఐసీడీఎస్ అధికారులు పలు రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ పరిశీలించిన కొత్త విషయాలను సిబ్బందికి ఆమె వివరించారు. కార్యక్రమంలో జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: గుంటూరు అర్బన్- 1 పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు(ఆయా) పోస్టులకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సీడీపీఓ కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలీనగర్, గుండారావుపేట, గుజ్జనగుండ్ల, ఫాతిమానగర్ ప్రాంతాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థినులు 7వ తరగతి ఉత్తీర్ణతతో పాటు స్థానికులై ఉండాలని తెలియజేశారు. పూర్తి చేసిన దరఖాస్తుల్ని ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు గుంటూరు అర్బన్- 1 కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: మరమ్మతుల దృష్ట్యా నగర పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ శ్రీనివాసబాబు తెలిపారు. పట్టణ ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

ఇద్దరు అదృశ్యంపై కేసు నమోదు



రంగారావు



వినయ్‌బాబు

గుంటూరు ఈస్ట్: ఇద్దరు అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్వీఎన్ కాలనీ 6వ లైనుకు చెందిన 72 సంవత్సరాల మానం రంగారావు ఈనెల 9వ తేదీ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయారు. ఆయన ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శుక్రవారం పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831343 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

● రామిరెడ్డినగర్ 4వ లైనుకు చెందిన ఎస్.వినయ్‌బాబు ఈనెల 8వ తేదీ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు శుక్రవారం నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831336 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

చోరీకి పాల్పడిన మహిళ అరెస్టు

పట్నంబజారు: దుకాణంలో నగదు చోరీకి పాల్పడిన నిందితురాలిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొద్ది రోజుల కిందట పట్నంబజారు పూల మార్కెట్‌లోని ఓ దుకాణంలో గుర్తు తెలియని వారు రూ. లక్ష అపహరించుకుపోయారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా సమాచారంతో యర్రసాని వరలక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి నగదు స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.


ఫిట్స్‌కు తక్షణ చికిత్సతో చెక్

- 13న ఇంటర్‌నేషనల్ ఎపిలెప్సీ డే
- ఆపరేషన్లతో నయం
- వ్యాధి ఉన్నా పెళ్లి చేసుకోవచ్చు

గుంటూరు మెడికల్: ఫిట్స్ (మూర్ఛ) వ్యాధికి వైద్యం లేదనే అపోహ చాలా మందిలో ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం 50 మిలియన్లకు పైగా ప్రజలు దీంతో బాధపడుతున్నారు. వీరిలో 80 శాతం అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే ఉన్నారు. మన దేశంలో 10 మిలియన్ల ప్రజలు బాధపడుతున్నారు. సకాలంలో చికిత్స చేస్తే మరణాల రేటు తగ్గించవచ్చు. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో 120 దేశాల్లో ఫిబ్రవరి రెండో సోమవారాన్ని ఇంటర్‌నేషనల్ ఎపిలెప్సీ డేగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఫిట్స్ అంటే...

మెదడులో ఉన్న న్యూరాన్లు విద్యుత్ ఆవేశం ఎక్కువైనప్పుడు బయట కనిపించే లక్షణాలనే ఫిట్స్ లేదా మూర్ఛ అంటారు. ఫిట్స్ వచ్చినప్పుడు కాళ్లు, చేతులు కొట్టుకుని పడిపోతారు. కొంత మంది నాలుక కొరుక్కోవడం, నోటి నుంచి నురగ కారడం గమనించవచ్చు. వ్యాధి ఎక్కువ సమయం ఉంటే మనిషి దేహం నీలంగా మారి ప్రాణాపాయ స్థితికి చేరుకోవచ్చు.



ఎపిలెప్సీ డే పోస్టర్స్

కారణాలు ఇవి

మెదడులో ఇన్‌ఫెక్షన్లు, గడ్డలు, తలకు గాయాలు, బ్రెయిన్ స్ట్రోక్స్, రక్తనాళాలు ఉబ్బడం, పుట్టుకతో వచ్చే జన్యుపరమైన సమస్యల వల్ల వ్యాధి వచ్చే అవకాశం ఉంది. పిల్లలు, పెద్దవాళ్లలోనూ వస్తుంది. గొంతులో, చెవిలో వచ్చే ఇన్‌ఫెక్షన్స్ వల్ల చిన్నారుల్లో వచ్చే అవకాశం ఉంది. స్త్రీల ప్రసవ సమయంలో కొన్ని చికిత్స విధానాలు పాటించకపోవడం వల్ల, టీబీ, హెచ్‌ఐవీ, మెదడు వాపు జబ్బుల వల్ల వైరస్‌లు, బ్యాక్టీరియా, ఫంగస్‌ల వల్ల కేసులు దేశంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. గుంటూరు జిల్లాల్లో సుమారు 95 న్యూరాలజీ క్లినిక్‌లు ఉన్నాయి. వీటిల్లో వారంలో 10 నుంచి 30 మంది వరకు ఫిట్స్ సమస్యతో చికిత్స పొందుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మూర్ఛకు గురైన వ్యక్తిని నేలపై పడిపోకుండా పట్టుకోవాలి.
- వ్యక్తి తల కింద మెత్తని పరుపు పెట్టి దెబ్బ తగలకుండా కాపాడాలి.
- బెల్టు, మెడకున్న టై, బిగుతుగా ఉన్న బట్టలను వదులుగా చేసి, ప్రశాంతంగా ఉండేటట్లు చూడాలి.
- మూర్ఛ అయిపోయిన తర్వాత శ్వాస ఆడటానికి వీలుగా వ్యక్తి శరీరాన్ని తిప్పాలి.
- నోటిలో నుంచి వచ్చే నురగను తుడిచివేయాలి.
- వ్యక్తితో ప్రేమగా మాట్లాడుతూ అతడు పూర్తిగా స్పృహలోకి వచ్చే వరకూ అక్కడే వారితోనే ఉండాలి.

రోగికి నీరు ఇవ్వొద్దు



ఫిట్స్ వచ్చినప్పుడు రోగి చేతిలో తాళాలు పెట్టటం, నోట్లో నీళ్లు పోయడం, గిల్లడం, కాలు ఒత్తడం లాంటి పనులు చేయకూడదు. వ్యక్తి మెలికలు తిరుగుతూ ఉంటే ఆపకూడదు. చుట్టూ గుమికూడొద్దు. మనిషి పూర్తిగా కోలుకునేంత వరకు నీళ్లు గానీ మరే ఇతర ద్రవపదార్థం గానీ ఇవ్వకూడదు. ఫిట్స్ రెండు నుంచి మూడు నిమిషాల పాటు ఉండి అవే తగ్గిపోతాయి. అంతకుమించి ఎక్కువసేపు ఉంటే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలి. వ్యాధి ఉన్న వారు స్విమ్మింగ్, డ్రైవింగ్ చేయకూడదు. ప్రమాదకర మెషిన్ల వద్ద పని చేయకూడదు.

– డాక్టర్ చెరుకూరి పవన్‌కుమార్, న్యూరాలజిస్టు, గుంటూరు

వ్యాధి ఉన్నా పెళ్లి చేసుకోవచ్చు



వ్యాధి ఉంటే పెళ్లి చేసుకోకూడదనే అపోహ ప్రజల్లో ఉంది. నేడు నయం చేసే వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి ఉన్నప్పటికి పిల్లలు సాధారణంగానే పుడతారు. దీనిపై అనుమానాలు పెట్టుకోవద్దు.

పిల్లల్లో లక్షణాలు కనిపించిన వెంటనే నరాల వ్యాధి నిపుణుల్ని సంప్రదించడం ద్వారా త్వరితగతిన కోలుకునే అవకాశం ఉంది.

– డాక్టర్ పమిడిముక్కల విజయ, సీనియర్ న్యూరాలజిస్ట్, గుంటూరు

ఆపరేషన్‌తో నయం



వ్యాధిని తగ్గించేందుకు మందులు 70 శాతం వరకు పనిచేస్తాయి. కేవలం 30శాతం మంది బాధితులకు ఎన్ని మందులు వాడినా తగ్గదు. వారికి ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి చేయిస్తే నూటికి 90శాతంతిరిగి రావు. మందులు వాడాల్సిన పని కూడా ఉండదు. 'యాంటీరియర్ టెంపరల్ లోబెక్టమి అండ్ ఎమిగ్దలా హిపోక్యాంపెక్టమి' అనే ఆపరేషన్ చేసి బాధితులకు సమస్య నుంచి విముక్తి కల్పిస్తున్నాం.

– డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, న్యూరో సర్జన్,

మదర్సాల్లోని విద్యార్థులను పాఠశాలల్లో నమోదు చేయాలి

సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, ఖాసీం

గుంటూరు ఎడ్యుకేషన్: మదర్సాల్లో చదువుతున్న విద్యార్థుల్ని ప్రభుత్వ పాఠశాలల్లో విధిగా నమోదు చేయాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని సమగ్ర శిక్ష విభాగంలో శుక్రవారం జిల్లాలోని మదర్సాల ప్రతినిధులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 2,989 మంది బాలలు బడిబయట ఉన్నట్లు గుర్తించగా, ప్రభుత్వ ఆదేశాలతో సంబంధిత బాలల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించామని చెప్పారు. వీరిలో 430 మందిని గుర్తించి, పాఠశాలల్లో చేర్పించామని తెలిపారు. మిగిలిన వారిలో ఎక్కువ మంది వేర్వేరు ప్రాంతాలకు వలసలు వెళ్లినట్లు గుర్తించామని పేర్కొన్నారు. కొంత మంది విద్యార్థులు దూరవిద్య టెన్త్‌లో ప్రవేశం పొందారని తెలిపారు. మదర్సాల్లో చదువుతున్న బాలల్లో ఎక్కువ మంది యూడైజ్ డేటాలో నమోదు కాకపోవడంతో వారిని బడిబయట పిల్లలుగా పరిగణించాల్సి వస్తోందన్నారు. మదర్సాల్లోని బాలబాలికలందర్నీ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధిగా నమోదు చేయించాలని నిర్వాహకుల్ని ఆదేశించారు. సమావేశంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసీం పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు పునాది ఇంటర్మీడియెట్

కళాశాల విద్య ఆర్జేడీ జోత్స్నకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న జోత్స్నకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నత చదువులతో జీవితంలో నిర్దేశించుకున్న రంగాల్లో స్థిరపడాలనుకునే విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్య కీలకమైనదని కళాశాల విద్య ఆర్జేడీ డాక్టర్ వి.ఆర్.జోత్స్నకుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 26వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్జేడీ మాట్లాడుతూ విద్యార్థినులు ఆకర్షణలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా అనుకున్న లక్ష్యాల్ని సాధించాలని హితవు పలికారు. ఇంటర్మీడియట్ విద్య ఆర్ఐవో, కళాశాల ప్రిన్సిపాల్ జి.సునీత మాట్లాడుతూ బైపీసీ, ఎంపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల వారీగా తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో వెయ్యి మందికి పైగా విద్యార్థినులు చదువుతున్నారని చెప్పారు. రాష్ట్రస్థాయిలో విద్య, ఎన్ఎస్ఎస్, సాంస్కృతిక, క్రీడా రంగాలల్లో గుర్తింపు పొందుతూ కళాశాల స్థాయిని ఇనుమడింప చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సీనియర్ అధ్యాపకులు సీహెచ్. పద్మావతి, బి.జె.షీలా, కె.శ్రీనివాసరావు, బి.మరియదాసు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలోని కల్యాణి బుక్‌హౌస్ వారితోపాటు అధ్యాపకులు ప్రతిభావంతులైన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు, బహుమతులు అందజేశారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

స్థిరమైన లక్ష్యంతోనే జీవితంలో ఉన్నతస్థాయి



సమావేశంలో మాట్లాడుతున్న ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్ రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకునేందుకు స్థిరమైన లక్ష్యం ఉండాలని ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్ రెడ్డి సూచించారు. సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శామ్యూల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలో భావి జీవితానికి పునాదులు వేసుకుని, అదే మార్గంలో పయనించాలని సూచించారు. వ్యామోహాలు, ఆక్షణలకు లోను కాకుండా లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ సుధీర్ కుమార్ సంద్ర మాట్లాడుతూ దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న యువతరానికి బాధ్యతల్ని గుర్తు చేస్తూ వందలాది కార్యక్రమాల ద్వారా జాగృతి కలిగిస్తున్న స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌ను స్ఫూర్తిగా తీసుకొని తమ లక్ష్యాల్ని సాధించుకోవాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఆనందబాబు మాట్లాడుతూ ఒకేషనల్ కళాశాల విద్యార్థినులు తమ కాళ్లపై తాము నిలబడేందుకు చదువుతోపాటు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సమగ్ర వైద్యశాల ఉద్యోగ సంఘ నాయకుడు మద్దు జ్యోతిబాబు, ఎస్.శరత్ చంద్రబోస్, అంజిరెడ్డి, సీహెచ్.ఎస్.ఎస్. మూర్తి, షేక్ మీరావలి, కె.చంద్రిక, విజయలక్ష్మి, సీహెచ్. కిశోర్‌బాబు పాల్గొన్నారు

విజయదుర్గ సూపర్ మార్కెట్ ప్రారంభం



మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పాత గుంటూరు: కొరిటెపాడు మెయిన్ రోడ్డులో కొమ్మినేని గార్డెన్స్, యస్‌బీఐ బ్యాంక్ ఎదురు నూతనంగా నిర్మించిన భవనంలో విజయదుర్గ సూపర్ మార్కెట్‌ను ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ యక్కలూరి మారుతి, కోటి లింగారెడ్డి, యూనీలివర్ లిమిటెడ్ స్టాకిస్ట్ మువ్వల నరేష్, వాసవీ యూత్ అధ్యక్షుడు తూనుగుంట్ల నాగేశ్వరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు, 35వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి టి.ఎల్.వి.ఆంజనేయులు, మన్నలూరి గౌరిశంకర్, వక్కలగడ్డ శివనాగేశ్వరరావు, గుడిపాటి భాస్కర్, రమణ, రవిబాబు పాల్గొన్నారు. లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో నాణ్యమైన, నమ్మకమైన సరుకుల్ని సూపర్ మార్కెట్‌లో అందుబాటు ధరల్లో అందించడం అభినందనీయమని తెలిపారు. టీఎల్‌వీ ఆంజనేయులు మాట్లాడుతూ కార్పొరేట్ స్టోర్స్‌కు దీటుగా పట్టణ ప్రజలకు పెద్ద సూపర్ మార్కెట్‌ను ప్రారంభిచడం అభినందనీయం తెలిపారు. సంస్థ మేనేజింగ్ పార్టనర్స్ తొండెపు శ్రీనివాసరావు, హరిప్రసాదరావు, దామర్ల మురళీకృష్ణ, మొహమ్మద్ యాసిన్, మాచవరపు శ్రీ సాయి అనీల్ కుమార్ మాట్లాడుతూ ప్రారంభోత్సవం సందర్భంగా మొదటి రోజు రూ. వెయ్యి పైన కొనుగోలు చేసిన ప్రతి వినియోగదారునికి రూ. 250 విలువగల నిత్యావసర సరుకులు ఉచితంగా అందించినట్లు చెప్పారు. సరుకులపై ఏడు నుంచి 50 శాతం డిస్కౌంట్ సదుపాయాన్ని వినియోగదారులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారులు, పుర ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జగ్జీవన్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలి

నెహ్రూనగర్: విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ కాంస్య విగ్రహం పక్కనే జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని నవ్య మాదిగ చర్మకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేజెండ్ల సుబ్బారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గుంటూరులోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లు అమలు కోసం అంబేడ్కర్ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టగా కొందరు దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. జగ్జీవన్‌రామ్ పోరాటం చేసి బిల్లు పాస్ అయ్యేలా చేసి దళిత, గిరిజన, బహుజనులకు రిజర్వేషన్లు సాధించేందుకు తగిన కృషి చేశారని చెప్పారు. అటువంటి ఆయన కాంస్య విగ్రహాన్ని అంబేడ్కర్ విగ్రహం పక్కనే 125 అడుగులతో ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం పక్కనే జగ్జీవన్‌రామ్ విగ్రహం పెట్టాలనే డిమాండ్‌తో మార్చి 24న విజయవాడలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళిత, గిరిజన సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

నగరంలో వేగంగా అభివృద్ధి పనులు

మేయర్ కావటి



పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి, డెప్యూటీ మేయర్లు డైమండ్‌బాబు, షేక్ సజీల

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వేగవంతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని 53, 54 డివిజన్లలో శుక్రవారం సీసీ డ్రెయిన్లు, బీటీ రోడ్డు నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నూతన పాలకవర్గం ఏర్పడ్డాక గుంటూరు నగరంలో రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. 53, 54 డివిజన్లకు అనుసంధాన రోడ్డు అయిన సంజీవయ్యనగర్ రైల్వే గేటు నుంచి ఆదిత్య నగర్ ఒకటో లైన్ వరకు రూ.49.90 లక్షలతో సీసీ డ్రెయిన్, రూ. 49 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు. సదరు రోడ్డును 80 అడుగుల రోడ్డుగా విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నామని మేయర్ వివరించారు. నగరంలో అభివృద్ధి పనులు పార్టీలకతీతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ప్రధాన రహదారుల విస్తరణ పనులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అండర్ గ్రౌండ్ డ్రెయిన్ పనుల పేరుతో గుంటూరు నగరాన్ని గుంటలూరుగా చేసిందని ఆరోపించారు. వాటి స్థానంలో ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన రోడ్లను నిర్మిస్తుందని మేయర్ తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో దివ్యాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, డెప్యూటీ మేయర్లు వనమా బాల వజ్ర బాబు(డైమండ్ బాబు), షేక్ సజీల, కార్పొరేటర్లు మల్లవరపు రమ్య, ధూపాటి వంశీ, తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, కోఆప్షన్ మెంబర్ పూనూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అగ్గిపెట్టె రాజు, గనిక ఝాన్సీ, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఖురాన్ పఠనం



బాబా సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

పాత గుంటూరు: జీటీ రోడ్డులోని హజరత్ కాలే మస్తాన్‌షా అవులియా 131వ ఉరుసు మహోత్సవాలు ధర్మకర్త రావి రామ్మోహనరావు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. బాబాకు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు, భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం గ్యార్మీ షరీఫ్(ఖురాన్ పఠనం) భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు బాబా సమాధిని దర్శించుకుని చాదర్‌ను సమర్పించారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్లు

నెహ్రూనగర్: 29వ డివిజన్ రామిరెడ్డినగర్‌లో హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. రూ. 35లక్షలతో రెండు రూంలు, కాంపౌండ్ వాల్, చుట్టూ రోడ్లు వేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ముందుగా శ్మశానంలో మట్టి లెవలింగ్ పనులు చేపట్టినట్లు 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్, 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధన దిశగా మాదిగలు అడుగువేయాలి

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ సాధన దిశగా మాదిగలు అడుగులు వేయాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ పిలుపునిచ్చారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ చేయకపోవడం బాధాకరమని తెలిపారు. వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఈ నెల 13న జరిగే రహదారుల నిర్బంధాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆక్వాకు మేలు చేసే ఆవిష్కరణలు రావాలి

వీసీ ఆచార్య పి.రాజశేఖర్



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ కరుణ తదితరులు

ఏఎన్‌యూ: ఆక్వారంగానికి మేలు చేసే నూతన ఆవిష్కరణలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఆక్వాకల్చర్ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఆక్వాకల్చర్ మేనేజ్‌మెంట్ అండ్ ఎన్విరాన్మెంటల్ ఇష్యూస్' అనే అంశం పైన రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ ఆక్వారంగంలోని రైతులు అధిక దిగుబడి కోసం అహర్నిశలు కష్టపడుతూ ఉంటారన్నారు. వీరికి ప్రయోజనం చేకూర్చే విధంగా ఆక్వారంగంలోని పరిశోధనలు కొనసాగాలన్నారు. చేపల వేటనే వృత్తిగా చేసుకుని జీవించే బడుగు బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎంతో అండగా ఉంటున్నారని తెలిపారు. మత్స్యకార వత్తిని కొనసాగించే వారందరికీ మంచి గిట్టుబాటు ధర వచ్చే విధంగా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను కల్పిస్తుందని చెప్పారు.ఈ సదస్సులో చర్చించే అంశాలు చేపల రైతులకు వారి సమస్యలను కొంతవరకైనా తీర్చే విధంగా ఉండాలన్నారు. రెక్టర్ ప్రొఫెసర్ వరప్రసాద మూర్తి మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు వాస్తవిక పరిస్థితులను అవగాహన చేసుకుని జనహితం కోసం నూతన ఆవిష్కరణలు చేసేందుకు ఉపయోగపడతాయని చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కరుణ మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో చేపల రైతులు చేపల పెంపకం చేయడం వలన అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. నూతన ఆవిష్కరణలు వల్ల చేపల రైతులు ఇంకా ఎంతో లాభపడే అవకాశం ఉంది అని అన్నారు. సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ సునీత మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థల నుంచి ఆక్వారంగానికి చెందిన అధ్యాపకులు, పరిశోధకులు ఈ సదస్సులో ప్రసంగించి పరిశోధనా పత్రాలు సమర్పించనున్నారని తెలిపారు. జువాలజీ మరియు ఆక్వా కల్చర్ ప్రొఫెసర్ పి.వి.కృష్ణ మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు విద్యార్థినీ విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటాయని అన్నారు. జువాలజీ, ఆక్వాకల్చర్ విభాగం ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హెచ్ స్మార్ట్ కీ హోండా యాక్టివా



నూతన వాహనాన్ని ప్రారంభిస్తున్న కరీం, జగన్‌మోహన్‌రావు, సుబ్బారెడ్డి తదితరులు

పాత గుంటూరు: టూ వీలర్ తయారీ దిగ్గజ కంపెనీ హోండా మోటార్స్ పాపులర్ సెల్లింగ్ మోడల్ హోండా యాక్టివా 6జీ అప్‌గ్రేడ్ వర్షన్ హెచ్ స్మార్ట్ నూతన మోడల్‌ను మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. నగరంలోని హోండా ఆథరైజ్ డీలర్ సంతోష్ హోండా షోరూంలో శుక్రవారం డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ షేక్ కరీం వాహనాన్ని మొదటి వినియోగదారునికి అందించారు. ఆయన మాట్లాడుతూ కాలుష్య కారక కర్బన ఉద్గారాలను అరికట్టి పొల్యూషన్ ఫ్రీ వాహనాల్ని తయారు చేయడంలో హోండా కంపెనీ పాత్ర ప్రశంసనీయమని కొనియాడారు. సంతోష్ హోండా అధినేత చుక్కపల్లి జగన్ మోహనరావు మాట్లాడుతూ వాహనం యాంటీ థెఫ్ట్ లాక్ టెక్నాలజీ, స్మార్ట్ స్టార్ట్, స్మార్ట్ అన్‌లాకింగ్, స్మార్ట్ ఫైండింగ్ వంటి నాలుగు ప్రధాన ఫ్యూచర్లతో యాక్టివా హెచ్ స్మార్ట్ తయారైనట్లు చెప్పారు. షోరూం జనరల్ మేనేజర్ ఎ.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతు కొత్త యాక్టివా సెరైన్ బ్లూ, మ్యాట్ యాక్సిస్ గ్రే, పెర్ల్ వైట్, గ్లిట్టర్ బ్లూ, రెబెల్ రెడ్, డార్క్ బ్లాక్ ఆరు ఆకర్షణీయమైన రంగులలో తక్షణ డెలివరీకి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో వాహన కొనుగోలు దారులు, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం



క్యాలెండర్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్ తదితరులు

నెహ్రూనగర్: విశ్వబ్రాహ్మణ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ తెలిపారు. అరండల్‌పేటలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ ఉద్యోగులంతా ఐక్యంగా ఉంటూ సంఘీయులకు సేవలందించాలని కోరారు. విశ్వబ్రాహ్మణ కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధితో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ప్రభాకర్, ప్రసాద్, సుబ్బారావు, శంకరశాస్త్రి, శివరామకృష్ణ, చిరంజీవి పాల్గొన్నారు.